# బీహార్‌లో హైడ్రామా

**బీజేపీతో కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్ సిద్ధం!**

**నేడు పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశం తర్వాత సీఎం పదవికి రాజీనామా!**

**అనంతరం బీజేపీ నేతలతో భేటీ • చర్చల తర్వాత నేరుగా రాజ్‌భవన్‌కు**

**రెండు డిప్యూటీలు, స్పీకర్ పదవి ఇవ్వాలని కమలం పార్టీ షరతు**

**ప్రభుత్వాన్ని కాపాడుకొనేందుకు ఆర్జేడీ, కాంగ్రెస్ విశ్వ ప్రయత్నాలు**

పాట్నా/న్యూఢిల్లీ, జనవరి 27: బీహార్ రాజకీయం రసకందాయంలో పడింది. రాష్ట్ర రాజకీయాల్లో హైడ్రామా నడుస్తున్నది. జేడీయూ అధినేత, సీఎం నితీశ్ కుమార్ మహాఘట్ బంధన్‌కు గుడ్‌బై చెప్పి మళ్లీ బీజేపీతో జట్టు కట్టేందుకు పావులు కదుపుతున్నారనే విస్తృత ప్రచారం నేపథ్యంలో ఏ క్షణం.. ఏం జరుగుతుందా? అనే ఉత్కంఠ నెలకొన్నది. సంకీర్ణ ప్రభుత్వంలోని ఆర్జేడీ, కాంగ్రెస్‌తో నెలకొన్న విభేదాల నేపథ్యంలో నితీశ్ ఆదివారం సీఎం పదవికి రాజీనామా చేసి, అనంతరం బీజేపీ మద్దతుతో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేసుకొన్నట్టు తెలుస్తున్నది. ఆదివారం ఉదయం 10 గంటలకు జేడీయూ శాసనసభ పక్ష సమావేశం ఉంటుందని, ఆ తర్వాత నితీశ్ రాజీనామా చేస్తారని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అనంతరం బీజేపీ నేతలతో సమావేశం తర్వాత నేరుగా రాజ్‌భవన్‌కు వెళ్లి, గవర్నర్‌కు రాజీనామా పత్రం సమర్పిస్తారని తెలిపాయి. దీంతో పాటుగా బీజేపీ ఎమ్మెల్యేల మద్దతుతో కూడిన లేఖను అందజేస్తారని, ఆ వెంటనే సాయంత్రం 4 గంటలకు మరోసారి సీఎంగా నితీశ్ కుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని తెలిపాయి. కొంత మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా నితీశ్ వెంట వెళ్లేందుకు సిద్ధమైనట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం ఉన్న ఆర్జేడీ మంత్రులను తొలగించి, వారి స్థానంలో బీజేపీకి చెందిన వారికి క్యాబినెట్‌లోకి తీసుకోనున్నారనే వాదన కూడా ఉన్నది.

నితీశ్

అమిత్‌షా

లాలూ ప్రసాద్

### మాంఝీతో సంప్రదింపులు!

రాష్ట్రంలో సంక్షోభం నేపథ్యంలో ప్రభుత్వాన్ని నిలబెట్టుకొనేందుకు ఇండియా కూటమి ప్రయత్నాలు చేస్తున్నది. ఇందులో భాగంగా ప్రస్తుతం బీజేపీ కూటమిలో ఉన్న హిందుస్థాన్ అవామ్ మోర్చా చీఫ్ మాజీ సీఎం జితన్ మాంఝీతో కాంగ్రెస్ సంప్రదింపులు చేసినట్టు తెలుస్తున్నది. ఇండియా కూటమిలో చేరాలని మాంఝీకి ఫోన్ చేసి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కోరినట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. నితీశ్‌తో మాట్లాడేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ ఆయన స్పందించలేదని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు.

### చర్చోపచర్చల్లో పార్టీలు

జేడీయూ, ఆర్జేడీ, బీజేపీ నేతలు సమావేశాలు, చర్చల్లో మునిగిపోయారు. పాట్నాలో నితీశ్ కుమార్ నివాసంలో జేడీయూ నేతలు సమావేశమయ్యారు. మరోవైపు బీజేపీ ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించింది. నితీశ్‌కు మద్దతు తెలుపుతూ ఎమ్మెల్యేలు లేఖను రాష్ట్ర పార్టీ నేతలకు అందజేసినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. బీహార్ బీజేపీ నేతలు పలువురు అధిష్ఠానం పెద్దలతో కూడా భేటీ అయినట్టు తెలుస్తున్నది. ఆర్జేడీ నేత, డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ నివాసంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర సీనియర్ నేతలు సమావేశం అయ్యారు. ఏ నిర్ణయమైనా తీసుకొనే అధికారాన్ని ఆర్జేడీ అధినేత లాలూకు ఎమ్మెల్యేలు అప్పగించారని ఎంపీ మనోజ్ ఝా వెల్లడించారు.

### నితీశ్‌కు షరతులతో బీజేపీ మద్దతు!

జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్‌కు బీజేపీ అంత ఉదారంగా మద్దతు పలుకడం లేదని తెలుస్తున్నది. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకోవడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వంలో కీలక పదవులు ఇవ్వాలని షరతులు పెట్టినట్టు సమాచారం. సీఎంగా నితీశే ఉండి.. తమ పార్టీకి రెండు డిప్యూటీ సీఎంలు, అసెంబ్లీ స్పీకర్ పదవి ఇవ్వాలనే ప్రతిపాదనలు బీజేపీ నేతలు అంతర్గతంగా జేడీయూ నేతల వద్ద పెట్టినట్టు తెలుస్తున్నది. అయితే పదేపదే కూటములను మార్చే నితీశ్‌కు మళ్లీ మద్దతు పలుకుడంపై రాష్ట్రంలోని బీజేపీ నేతలు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

**బిహార్ అసెంబ్లీ(243)లో పార్టీల సంఖ్యా బలం**

| | |
|---|---|
| ఆర్జేడీ | 79 |
| బీజేపీ | 78 |
| జేడీయూ | 45 |
| కాంగ్రెస్ | 19 |
| లెఫ్ట్ పార్టీలు | 16 |
| హెచ్‌పీఎం | 4 |
| ఎంఐఎం | 1 |
| స్వతంత్రులు | 1 |

జరాంగేకు పండ్ల రసం తాగించి నిరసనను విరమింపజేస్తున్న సీఎం షిండే

## దిగొచ్చిన మహారాష్ట్ర ప్రభుత్వం

**మరాఠా రిజర్వేషన్లకు ఆర్డినెన్స్ జారీ**

ముంబై, జనవరి 27: మరాఠా రిజర్వేషన్ల కోసం ఉద్యమకారుడు మనోజ్ జరాంగే నేతృత్వంలో కొనసాగిన సుదీర్ఘ పోరాటానికి మహారాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చింది. రిజర్వేషన్లతోపాటు ఇతర డిమాండ్లను అంగీకరిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం అర్ధరాత్రి ఆర్డినెన్స్‌ను కూడా జారీ చేసింది. అనంతరం శనివారం ఉదయం ఓ నోటిఫికేషన్‌ను జారీ చేస్తూ కుంబీలంతా మరాఠా రక్త సంబంధీకులుగా గుర్తిస్తున్నట్టు తెలిపింది. మరాఠాలకు విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ ఉద్యమకారుడు మనోజ్ జరాంగే నేతృత్వంలో పోరాటం కొనసాగిన విషయం తెలిసిందే. రిజర్వేషన్లపై శనివారం 11 గంటలకల్లా తేల్చాలని జరాంగే పెట్టిన డెడ్‌లైన్‌కు స్పందించిన సీఎం ఏక్‌నాథ్ షిండే శుక్రవారం రాత్రి అధికారులతో సుదీర్ఘ చర్చలు జరిపారు. అనంతరం ఓ బృందాన్ని జరాంగే వద్దకు పంపారు. రిజర్వేషన్లతోపాటు అన్ని డిమాండ్లను అంగీకరిస్తున్నట్టు తీసుకొచ్చిన ఆర్డినెన్స్ పత్రాలను జరాంగేకు బృందం అందజేసింది. తర్వాత శనివారం సీఎం షిండే జరాంగే వద్దకు వెళ్లారు. పండ్ల రసాన్ని అందజేసి నిరసన దీక్షను విరమింపజేశారు.

**అవాంతరాలను అధిగమించి.. విజయం సాధించాం: జరాంగే**

తన చిరకాల కోరిక నెరవేరడంతో జరాంగే ఆనందం వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల సాధన కోసం సుదీర్ఘ పోరాటం చేశామని, చాలా మంది అమలయ్యారని భావోద్వేగానికి గురయ్యారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా వెనుకడుగు వేయకుండా పోరాడి విజయం సాధించామని తెలిపారు.

## మంచి జడ్జీలకు కోర్టుల్లో చోటేది: దవే

న్యూఢిల్లీ: అన్ని కోర్టుల్లో మంచి న్యాయమూర్తులు నియమితులు కావడం లేదని సీనియర్ అడ్వకేట్ దుష్యంత్ దవే ఆవేదన వ్యక్తం చేశారు. కొలీజియం వ్యవస్థ సరైన రీతిలో పని చేయడం లేదన్నారు. కొలీజియం తీర్మానాలను తప్పనిసరిగా అమలు చేయాలని, వీటిలో నచ్చినదానిని ఎంపిక చేసుకుని అమలు చేయకూడదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పిందని తెలిపారు. ఈ తీర్పును ప్రభుత్వం పదే పదే ఉల్లంఘిస్తున్నప్పటికీ, సుప్రీంకోర్టు ఏమీ చేయడం లేదన్నారు. తమ నిర్ణయాలు సాధ్యమైనంత త్వరగా అమలయ్యేలా చూసే ధైర్యం న్యాయమూర్తులకు లేదన్నారు. ప్రముఖ న్యాయమూర్తులకు పదోన్నతులు కల్పించడంలో కూడా కొలీజియం తీరును దవే తప్పుబట్టారు.

## జడ్జీల జగడం కేసులో సుప్రీంకోర్టు స్టే

న్యూఢిల్లీ: కలకత్తా హైకోర్టులో ఇద్దరు న్యాయమూర్తుల మధ్య నెలకొన్న జగడంపై సుప్రీంకోర్టు శనివారం కీలక ఆదేశాలు జారీ చేసింది. పశ్చిమ బెంగాల్‌లో వైద్య కళాశాలలు, హాస్పిటల్స్‌లో ఎంబీబీఎస్ ప్రవేశాల్లో అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఆరోపణల కేసుకు సంబంధించి కలకత్తా హైకోర్టు రెండు బెంచ్‌ల ముందు అన్ని ప్రొసీడింగ్స్‌ను నిలిపివేస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఉత్తర్వులు ఇచ్చింది. సుమోటోగా విచారణ చేపట్టిన సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఈ కేసు తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. కేసులో సింగిల్ బెంచ్ జడ్జి దర్యాప్తు ఆదేశాలపై మరో జడ్జి మధ్యంతర ఆదేశాలివ్వడంపై వివాదం రేగింది.

## అంబేద్కర్‌కు కాంగ్రెస్ మరో ద్రోహం!

**రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కాదు నెహ్రూ • అద్వానీ సన్నిహితుడు సుధీంద్ర • ఆయన వ్యాఖ్యలకు పిట్రోడా సమర్థన**

పిట్రోడా

న్యూఢిల్లీ: 'భారత రాజ్యాంగ రూపకర్త అంబేద్కర్ అన్నది భారత ఆధునిక చరిత్రలో పెద్ద అబద్ధం. వాస్తవానికి రాజ్యాంగ నిర్మాణంలో అంబేద్కర్ కన్నా జవహర్‌లాల్ నెహ్రూ ప్రముఖ పాత్ర పోషించారు' అంటూ బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీకి అత్యంత సన్నిహితుడైన సుధీంద్ర కులకర్ణి రాసిన వ్యాసాన్ని కాంగ్రెస్ నేత పిట్రోడా సమర్థించడం సరికొత్త వివాదానికి తెరలేపింది. సుధీంద్ర కులకర్ణి ఓ పత్రికకు రాసిన ఆ వ్యాసం స్క్రీన్‌షాట్‌ను ఇటీవల పిట్రోడా తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. దీనిపై పలువురు రాజకీయ నేతలు స్పందిస్తూ ఇది అంబేద్కర్ అభిమానులను, దళితులను అవమానించడమేనని మండిపడ్డారు. పిట్రోడా వైఖరిని కాంగ్రెస్ సమర్థిస్తుందా అంటూ బీజేపీ నేతలు ప్రశ్నించారు. భారత రాజ్యాంగ రూపకల్పనలో అంబేద్కర్ ప్రధాన పాత్ర పోషించారన్నది జగమెరిగిన సత్యమని, కానీ పిట్రోడా వ్యాఖ్యలు ఆయనను కించపరిచే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ మొదటి నుంచి దళితులకు, అంబేద్కర్‌కు వ్యతిరేకమని విమర్శించారు. పిట్రోడా రాహుల్ గాంధీకి సన్నిహితుడు, మార్గదర్శకుడని అంటూ.. రాహుల్ భాషనే పిట్రోడా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. అయితే తాను చేసిన పరిశోధన ఆధారంగానే ఆ వ్యాసం రాసినట్టు కులకర్ణి వివరించారు. రాజ్యాంగ పీఠికను రూపొందించడంలో అంబేద్కర్‌కు ఎటువంటి పాత్ర లేదని, అంతా నెహ్రూ రూపొందించిన ముసాయిదానేనని స్పష్టం చేశారు.

రోడ్డు పక్కన కుర్చీలో కూర్చొని నిరసన తెలుపుతున్న ఆరిఫ్ మహ్మద్ ఖాన్

## రోడ్డుపై కేరళ గవర్నర్ ధర్నా

- **ఎస్ఎఫ్ఐ నిరసనకు ప్రతిగా ఆరిఫ్ మహ్మద్ ఖాన్ ఆందోళన**
- **గవర్నర్‌కు జడ్ ప్లస్ కేటగిరీ భద్రత కేటాయించిన కేంద్రం**

కొల్లాం(కేరళ), జనవరి 27: కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ రోడ్డెక్కి రాష్ట్ర ప్రభుత్వ చర్యను విమర్శించడం సంచలనం సృష్టించింది. దీంతో కొల్లాం జిల్లాలో శనివారం నాటకీయ పరిణామాలతో రెండు గంటల పాటు హైడ్రామా నడిచింది. వెంటనే గవర్నర్ భద్రతను జడ్ ప్లస్ కేటగిరీకి పెంచుతున్నట్టు కేంద్రం ప్రకటించింది. కొట్టారక్కరలో ఒక కార్యక్రమానికి హాజరయ్యేందుకు తిరువనంతపురం నుంచి వెళ్తున్న గవర్నర్‌కు వ్యతిరేకంగా రోడ్ పక్కన సీపీఐ(ఎం) అనుబంధ సంస్థ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు నల్లజెండాలతో నిల్చుని 'సంఘీ చాన్స్‌లర్ గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. దీంతో తీవ్ర అసహనానికి గురైన గవర్నర్ తన కారును ఆపమని చెప్పి ఆందోళనకారుల వద్దకు నడుచుకుంటూ వెళ్లి 'రండి' అంటూ గట్టిగా అరిచారు. దీనికి ప్రతిగా ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు కూడా రెచ్చిపోయి ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు గవర్నర్‌కు, ఆందోళనకారులకు మధ్య రక్షణ వలయంగా ఏర్పడ్డారు. పోలీసులు ఆందోళనకారులను అక్కడి నుంచి పంపించివేసినా గవర్నర్ మాత్రం అక్కడి నుంచి కదలలేదు. దగ్గర్లోని షాపు నుంచి ఒక కుర్చీ తెప్పించుకుని దానిపై కూర్చున్నారు. ఎస్ఎఫ్ఐ కార్యకర్తలపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను చూపేవరకు అక్కడే కూర్చున్నారు.

### కేంద్రం గుప్పిట్లో రాజ్యాంగ సంస్థలు

రాజ్యాంగ సంస్థలను గుప్పిట్లో ఉంచుకోవడం ద్వారా కేంద్రం ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనం చేస్తున్నదని కేరళ సీఎం విజయన్ శనివారం ఆరోపించారు. ఇది ప్రమాదకర వైఖరని అన్నారు. ఇటీవల కాలంలో కేంద్రం ఎన్నికల సంఘంతో సహా అన్ని రాజ్యాంగ సంస్థలను తన చేతిలో ఉంచుకుని ఆడిస్తున్నదని ఆయన విమర్శించారు. ఇవన్నీ ప్రాథమికంగా మన ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనం చేస్తాయని అన్నారు.

## 'అయోధ్య పురావస్తు నివేదిక బయటపెట్టాలి'

న్యూఢిల్లీ : అయోధ్యలోని రామజన్మ భూమి స్థలం చరిత్రపై విమర్శలు వస్తున్నందువల్ల భారత పురావస్తు సర్వే (ఏఎస్ఐ) నివేదికను బయటపెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రముఖ ఆర్కియాలజిస్ట్ బీఆర్ మణి కోరారు. ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, బాబ్రీ మసీదు కింద ఉన్న శిథిలాలు 12వ శతాబ్దానికి చెందినవని తెలిపారు. హిందూ, బౌద్ధ, జైన మతాలకు సంబంధించిన శిల్పాలు సాక్ష్యాధారాలుగా కనిపించాయన్నారు. ఈ నివేదికను బయటపెడితే వివాదాలు నోళ్లు మూతపడతాయని మణి ఈ ఇంటర్వ్యూలో తెలిపారు. కోర్టు ఆదేశాల కారణంగా తాను 16 సంవత్సరాలపాటు దీని గురించి మాట్లాడలేదని చెప్పారు.

## 'జ్ఞానవాపీలో పూజలకు అనుమతించాలి'

న్యూఢిల్లీ: వారణాసిలోని వివాదాస్పద జ్ఞానవాపీ మసీదులో హిందువులు పూజ చేసుకునేందుకు అనుమతించాలని విశ్వ హిందూ పరిషత్ డిమాండ్ చేసింది. మసీదును వేరే ప్రదేశంలో నిర్మించుకొని దాన్ని కాశీ విశ్వనాథ స్వామి టీకే అప్పగించాలని వీహెచ్‌పీ వర్కింగ్ ప్రెసిడెంట్ అలోక్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. జ్ఞానవాపీ మసీదు స్థానంలో పూర్వం హిందూ ఆలయం ఉండేదని ఇటీవల ఏఎస్ఐ చేసిన పరిశోధనల్లో మరోసారి నిర్ధారణ అయ్యిందని, దానిని హిందూ దేవాలయంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

## ఒక్కో ఆప్ ఎమ్మెల్యేకు 25 కోట్లతో ఎర

- **బీజేపీ డబ్బుల ఆఫర్‌ను మా వాళ్లు తిరస్కరించారు**
- **నా అరెస్ట్ ప్లాన్ ప్రభుత్వాన్ని కూల్చేయడానికే: కేజ్రీవాల్**

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ బీజేపీపై సంచలన ఆరోపణలు చేశారు. తమ పార్టీకి చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలను ఒక్కొక్కరిని రూ.25 కోట్లతో కొనేందుకు బీజేపీ ప్రయత్నించిందని ఆరోపించారు. మద్యం విధానం కేసులో కేజ్రీవాల్‌ను త్వరలోనే అరెస్టు చేయబోతున్నామని, రాష్ట్ర ప్రభుత్వం కూలిపోతుందని వారిని బెదిరించిందన్నారు. అయితే తమ పార్టీ ఎమ్మెల్యేలంతా ఐకమత్యంగా ఉంటూ, ఈ ఆఫర్‌ను తిరస్కరించారన్నారు. ఎక్స్‌లో కేజ్రీవాల్ శనివారం చేసిన సుదీర్ఘ పోస్ట్‌లో ఈ ఆరోపణలు చేశారు.

''ఇటీవల వారు (బీజేపీ) ఢిల్లీకి చెందిన మా ఏడుగురు ఎమ్మెల్యేలను సంప్రదించారు. కొన్ని రోజుల తర్వాత కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేస్తాం. ఆ తర్వాత ఎమ్మెల్యేల్లో చీలిక తెస్తాం. 21 మంది ఎమ్మెల్యేలతో మాట్లాడాం. మీరు కూడా రావచ్చు. మేం రూ.25 కోట్లు ఇస్తాం, బీజేపీ టిక్కెట్ మీద ఎన్నికల్లో పోటీ చేయండి'' అని బీజేపీ నేతలు తమ పార్టీ ఎమ్మెల్యేలతో చెప్పారని కేజ్రీవాల్ తెలిపారు. ఆప్‌ను ఎన్నికల్లో ఓడించే సత్తా బీజేపీకి లేదని, అందువల్లే ఢిల్లీ రాష్ట్రంలోని తమ ప్రభుత్వాన్ని కూల్చేయాలని ప్రయత్నిస్తున్నదని కేజ్రీవాల్ ఆరోపించారు. ''దీని అర్థం ఏమిటంటే, నన్ను అరెస్టు చేయబోతున్నది ఏదో మద్యం పాలసీ కేసులో దర్యాప్తు కోసం కాదు. ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వాన్ని కూల్చేయడానికి. భగవంతుడు, ప్రజలు ఎల్లప్పుడూ మాకు మద్దతిచ్చారు. ఈసారి కూడా వాళ్లు తమ దురుద్దేశాలను అమలు చేయడంలో విఫలమవుతారు'' అని చెప్పారు. ఢిల్లీ మంత్రి అతిశీ కూడా బీజేపీపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఓ బీజేపీ నేత ఆప్ ఎమ్మెల్యేకు చేసిన ఫోన్ కాల్ రికార్డయిందన్నారు.

### అబద్ధాలు కొనసాగుతున్నాయి : బీజేపీ

ఆమ్ ఆద్మీ పార్టీ చేసిన ఆరోపణలపై బీజేపీ నేత కపిల్ మిశ్రా స్పందించారు. కేజ్రీవాల్ అబద్ధాలు చెప్పడం కొనసాగిస్తున్నారని తెలిపారు. ఆప్ ఎమ్మెల్యేలను సంప్రదించడానికి ఉపయోగించిన ఫోన్ నంబర్‌ను కేజ్రీవాల్ కనీసం ఒకసారైనా బయటపెట్టలేదన్నారు. ఆ పార్టీ ఎమ్మెల్యేలను ఎవరు సంప్రదించారో, ఎక్కడ సమావేశమయ్యారో కూడా చెప్పడం లేదన్నారు. కేవలం ప్రకటనలు ఇచ్చి, దాక్కుంటారన్నారు.



## బైడెన్‌కూ డీప్‌ఫేక్ సెగ

**అమెరికా అధ్యక్షుడి గొంతుతో నకిలీ ఆడియో వైరల్**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు కూడా డీప్‌ఫేక్ సెగ తగిలింది. ఈ సంవత్సరం చివర్లో జరగనున్న అధ్యక్ష ఎన్నికలకు అభ్యర్థిత్వం కోసం ప్రస్తుతం అమెరికాలో ప్రైమరీ పోల్స్ నిర్వహిస్తున్నారు. 'ఈ ఎన్నికల్లో ఓటు వేయొద్ద'ని బైడెన్ ఓటర్లను కోరినట్లు ఉన్న ఒక నకిలీ ఆడియో వైరలైంది. కృత్రిమ మేధ(ఏఐ) ఆధారంగా సృష్టించిన ఈ డీప్‌ఫేక్ కాల్స్‌పై వైట్‌హౌస్ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రముఖ గాయని టేలర్ స్విఫ్ట్‌పై అభ్యంతరకరంగా రూపొందించిన డీప్‌ఫేక్ దృశ్యాలు కూడా నెట్టింట్లో చక్కర్లు కొట్టడం కలవరానికి గురిచేస్తున్నది.

**డీప్ ఫేక్ ఎన్ని రకాలు?**

**ఫేస్ స్వాపింగ్:** అసలు వీడియోలోని వ్యక్తి ముఖాన్ని కాకుండా మరో వ్యక్తి ముఖాన్ని చూపటం.

**సింథటిక్ వాయిస్ :** నకిలీ ఆడియోను సృష్టించడం.

**టెక్స్ట్ బేస్డ్ డీప్‌ఫేక్:** చేతి రాతను ఏఐ టూల్స్‌తో విశ్లేషించి.. ఫేక్‌ను సృష్టించడం.

**ఆబ్జెక్ట్ మ్యానిప్యులేటింగ్ :** ఏదైనా వీడియోలో వ్యక్తులతో పాటు వారి చుట్టూ ఉన్న వస్తువుల్ని, ప్రదేశాలను మార్చడం.

**హైబ్రిడ్ డీప్‌ఫేక్:** పైన చెప్పిన అన్ని డీప్‌ఫేక్ టెక్నిక్‌లను ఒకే వీడియోలో వినియోగించడం.

**గుర్తించడమెలా?**

వీడియో క్వాలిటీ, ఆడియో, టెక్స్ట్‌లో కొన్ని లోపాలు, వ్యత్యాసాల్ని గమనించవచ్చు. అభ్యంతరకరంగా, ఫేక్‌గా కనిపించిన వీడియోలను ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ తొలగిస్తున్నాయి. ఫార్వర్డెడ్ సందేశాలు నిజమినవా? కాదా? అని విశ్లేషించుకొన్న తర్వాతే యూజర్లు స్పందిస్తే మంచిది.

## స్థానిని బట్టి 'ఉన్నత' విద్యా సంస్థల గుర్తింపు

**రెండు అంచెల్లో అక్రెడిటేషన్ జారీ.. ప్రపంచస్థాయి గుర్తింపును కోరుకుంటే 'మెచ్యూరిటీ బేస్డ్ గ్రేడెడ్ అక్రెడిటేషన్'**

**కే రాధాకృష్ణన్ కమిటీ సిఫారసులకు న్యాక్ కమిటీ ఆమోదం**

*న్యూఢిల్లీ, జనవరి 27: ఉన్నత విద్యా సంస్థల గుర్తింపు, క్రమబద్ధీకరణ వ్యవస్థలో సంస్కరణలు చేపట్టబోతున్నట్టు కేంద్ర విద్యాశాఖ ప్రకటించింది. రెండు అంచెల్లో సంస్కరణలు అమల్లోకి తీసుకొస్తున్నట్టు తెలిపింది. ఒకటి.. ఉన్నత విద్యా సంస్థలకు గుర్తింపు మాత్రమే ఇచ్చే 'బైనరీ అక్రెడిటేషన్'. రెండోది.. డిసెంబర్ అమల్లోకి నుంచి మెచ్యూరిటీ బేస్డ్ గ్రేడెడ్ అక్రెడిటేషన్. ప్రపంచవ్యాప్తంగా ఆయా దేశాల్లో ఉత్తమ పద్ధతులను అనుసరించి 'బైనరీ అక్రెడిటేషన్' జారీ చేస్తామని, ఒకవేళ ఉన్నత విద్యా సంస్థలు ప్రపంచస్థాయి గుర్తింపును కోరుకుంటే 'మెచ్యూరిటీ బేస్డ్ గ్రేడెడ్ అక్రెడిటేషన్'ను ఎంచుకోవచ్చునని కేంద్ర విద్యా శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఉన్నత విద్యా సంస్థల 'గ్రేడెడ్ అక్రెడిటేషన్', 'ర్యాంకుల' స్థానంలో కొత్త విధానాన్ని ప్రవేశపెట్టాలని డాక్టర్ కే రాధాకృష్ణన్ (ఇస్రో మాజీ చైర్మన్) నేతృత్వంలోని కమిటీ సిఫారసులు చేయగా, దీనికి 'న్యాక్' ఎగ్జిక్యూటివ్ కమిటీ శనివారం ఆమోదముద్ర వేసింది. నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ-2020) అమల్లో భాగంగా ఉన్నత విద్యా వ్యవస్థలో అత్యంత వేగంగా సమూల మార్పులు తీసుకురాబోతున్నట్టు ఈ సందర్భంగా కేంద్ర విద్యాశాఖ ప్రకటించింది.*

**సమూల మార్పులివే..**

*న్యాక్ ఏ++, ఏ+,ఏ, బీ అంటూ ఉన్నత విద్యా సంస్థలకు జారీచేస్తున్న గుర్తింపు విధానం రద్దు అవుతుంది. ప్రస్తుతమున్న 'మెథడాలజీ' ప్రకారం 'గుర్తింపు' లేదా 'గుర్తింపు లేదు' (బైనరీ అక్రెడిటేషన్) అన్నది మాత్రమే జారీ అవుతుంది. రెండోది.. 'మెచ్యూరిటీ బేస్డ్ గ్రేడెడ్ అక్రెడిటేషన్'. కాలేజీ నేపథ్యం, విద్యా ప్రమాణాలు, నాణ్యత, స్థాయిని తెలిపే విధంగా లెవల్-1 నుంచి లెవల్-5 వరకు వివిధ హోదాలో గుర్తింపు ఉంటుంది. 2024 డిసెంబర్ నుంచి 'మెచ్యూరిటీ బేస్డ్ గ్రేడెడ్ అక్రెడిటేషన్'ను ఇవ్వబోతున్నట్టు తెలిపింది. 'గ్లోబల్ ఎక్స్‌లెన్స్' కాలేజీకి లెవల్-5 స్థాయి దక్కుతుంది.*

**వన్ నేషన్ వన్ డాటా కిందకు..**

*ఉన్నత విద్యాసంస్థల డాటా నిర్వహణ, పారదర్శకత కోసం..వీటిని 'వన్ నేషన్ వన్ డాటా' పరిధిలోకి తీసుకొస్తున్నట్టు కేంద్రం పేర్కొన్నది. సంస్థాగత డాటాను అందజేయటంలో సమగ్రత, పారదర్శకతను నిర్ధారించడానికి సంస్కరణలో భాగంగా కమిటీ దీనిని ప్రతిపాదించింది. డాటా చెల్లుబాటు, విశ్వసనీయత మెరుగుపర్చడానికి దీనిని ప్రతిపాదిస్తున్నట్టు తెలిపింది. విద్యార్థులు, పరిశ్రమలు, ఇతరులు డాటాను పొందే విధంగా డిజైన్ చేసింది.*

## అనుకోకుండా బరువు తగ్గడం క్యాన్సర్‌కు సంకేతం!

న్యూఢిల్లీ: ఎలాంటి ప్రయత్నం చేయకుండానే బరువు తగ్గడం ఆరోగ్యానికి చేటు అని స్వీడన్‌లోని కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్ రీసెర్చర్స్ నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. అనుకోకుండా బరువు తగ్గడానికి, క్యాన్సర్ ముప్పు పెరగడానికి సంబంధం ఉన్నట్లు తేలింది. అకస్మాత్తుగా బరువు తగ్గితే, కడుపు, ప్రేగుల్లో క్యాన్సర్; రక్తం, బాడీ టిష్యూలకు సంబంధించిన క్యాన్సర్; కొలొరెక్టల్ క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ ముప్పు పెరిగే అవకాశం ఉన్నట్లు వెల్లడైంది. అందువల్ల అకస్మాత్తుగా లేదా అనుకోకుండా బరువు తగ్గినపుడు వెంటనే వైద్య సలహాలు తీసుకుని, తగిన మందులను వాడాలని పరిశోధకులు తెలిపారు.

## జార్ఖండ్ సీఎంకు మరోసారి ఈడీ సమన్లు

న్యూఢిల్లీ, జనవరి 27: మనీలాండరింగ్ కేసులో జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌ను ప్రశ్నించేందుకు ఈడీ శనివారం మరోసారి సమన్లు జారీ చేసింది. ఈ నెల 29 లేదా 31న ఏ రోజు అందుబాటులో ఉండగలరో తెలపాలని ఈడీ కోరింది. భూ కుంభకోణానికి సంబంధించి అక్రమ నగదు లావాదేవీలు జరిగాయంటూ ఈ కేసులో ఈడీ ఆరోపిస్తున్నది. మొదటిసారిగా జనవరి 20న సీఎం హేమంత్ సోరెన్‌ను ఈడీ ఏడు గంటలకుపైగా ప్రశ్నించింది. దర్యాప్తులో మరిన్ని ప్రశ్నలు ఆయన్ను అడగాల్సి ఉందని, వాటిని రికార్డు చేయాల్సి ఉంటుందని ఈడీ తెలిపింది.

## రబ్రీదేవికి ఢిల్లీ కోర్టు సమన్లు

న్యూఢిల్లీ, జనవరి 27: ఉద్యోగాలకు భూమి కుంభకోణం మనీలాండరింగ్ కేసులో ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ భార్య, బీహార్ మాజీ సీఎం రబ్రీ దేవి, ఆమె కుమార్తెలు మీసా భారతి, హేమా యాదవ్‌లకు ఢిల్లీ కోర్టు సమన్లు జారీ చేసింది. ఫిబ్రవరి 9న కోర్టు ముందు హాజరు కావాలని జడ్జి విశాల్ శనివారం ఆదేశించారు. ఈడీ చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకొన్న న్యాయస్థానం ఈ మేరకు సమన్లు జారీ చేసింది. ఈ కేసులో విచారణ ముందుకు సాగేందుకు తగిన ఆధారాలు ఉన్